# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళా సాధికారత కోసం కృషి చేసిన గొప్ప పాలకురాలు అహల్య బాయి అని కేంద్ర ప్రసార సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ అన్నారు.**
2. **పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు**
3. **దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లో జూన్ 1 వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.**
5. **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**

==========================

మహిళా సాధికారత కోసం కృషి చేసిన గొప్ప పాలకురాలు అహల్య బాయి హోల్కర్ అని కేంద్ర ప్రసార సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన అహల్య బాయి హోల్కర్ 300వ జయంతి సభలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, అహల్య బాయి స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారత కోసం గ్యాస్ కనెక్షన్లు స్వయం సహాయక సంఘాల రుణాల మంజూరు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొంటూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు సభలో ముఖ్యమంత్రి నిన్న మాట్లాడుతూ... రాయలసీమ ప్రాంతాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. జూన్ 12లోపు కడపలో రాయలసీమ ఉక్కు కర్మాగారం పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్.. 28 సెకన్లు

మరోవైపు మహానాడు ముగింపు అనంతరం కడప నుంచి బయలుదేరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఆయన ఈ రోజు సాయంత్రం జరిగే భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. 'బిల్డింగ్ ట్రస్ట్.. ఇండియా ఫస్ట్' ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ నూతన పారిశ్రామిక విధానాల గురించి వివరించి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని బాచుపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత సాయంత్రం నిర్వహించిన 'జైహింద్ ర్యాలీ'లో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారత్ సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చామని తెలుపుతూ,

వాయిస్...33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జూన్ 1 వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని ఒక రేషన్ దుకాణాన్ని సందర్శించిన ఆయన ఈ మేరకు 'ఈ పోస్' యంత్రంలో ఏర్పాటు చేసిన నూతన సాఫ్ట్‌వేర్ పనితీరును నిన్న పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల వద్దే సరకులు ఇస్తారని పునరుద్ఘాటించారు. 65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగుల జాబితాను సిద్ధం చేశామని..వారికి ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ లోపు డీలరే ఇంటికి వెళ్లి సరకులు ఇస్తారని తెలిపారు.

---------------------------

వైయస్సార్ కడప జిల్లాలోని గండికోటను గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జమ్మలమడుగులోని గండికోట ప్రాంతాన్ని స్థానిక శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డితో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, గండికోట అభివృద్ధికి సుమారు 78 కోట్లు కేటాయించామని చెప్పారు. చరిత్రను గురించి తెలియజేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని కేంద్రమంత్రి తెలుపుతూ..

వాయిస్..28 సెకన్లు

---------------------------

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి

మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిన్న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పూర్తిస్థాయిలో భూభారతి పథకాన్ని అమలు చేయనున్నామని చెప్పారు. సన్న వడ్లకు అదనపు నగదు చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని భట్టి విక్రమార్క తెలిపారు.

---------------------------

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 ప్రాంతీయ భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. కాగా ఈ షబ్ద్ పోర్టల్‌లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్‌తో పాటు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీరైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రవాయుగుండంగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తర కోస్తాంధ్రలో భారీవర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలుపుతూ,

వాయిస్…26 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================